కథానిక

# చదువు విలువ

యాముజాల శంకరం

"ఆహా!...ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర...ఏం పద్యంరా సత్యం..."అంటున్నాడు సుబ్బులు.

"ఇంతకన్నా యింకా బ్రహ్మాండమైన పద్యాలున్నాయి. 'వెతలంబెట్టకు మింకనన్నుచు నీవీ బంధమూడన్...'ఇదిచూడు"సత్యం సమాధానమిచ్చాడు.

"దానికంటె, ప్రాంచద్భూషణ అన్న పద్యం బ్రహ్మాండంగాలేదూ?"అడిగాడు సుబ్బులు.

"అవును నవరసాల్లో ముఖ్యంగా మూడురసాలెక్కువ జనాన్ని ఆకర్షిస్తాయట. వీరరసం, శృంగారరసం, హాస్యరసం."

"అవునుమరి. అందుకనే పూర్వపు కవులందరూ శృంగారరస సముద్రాన్నే మథించారు."

రూములో వీళ్ళ పోట్లాటచూస్తూంటే, నవ్వొచ్చింది రంగాకు. ఇంతలోకే సత్యం గొంతెత్తి "సాంధ్యశ్రీ" పద్యాలు చదవటం మొదలుపెట్టారు. "వద్దో, అపరోఁయ్"అని ఆపుచేస్తున్నాడు సుబ్బులు. కొంతమందికి ఇదొక తెగులు. పాడమంటే పాడనంటారు. వాళ్ళకిష్టమయిందా వద్దనా ఆ వరవడి ఆగదు. పాడాలి. ఆ పాడింది నలుగురూ. తలకాయనొప్పివచ్చినాసరె, చచ్చినట్టు వినాలి. పాడిందేపాటయితే. ఎంతమంచిగా పాడినా, ముఖం మొత్తుతుంది. అందుకనే, మన కవులు, పుస్తకంతీసినా (ముఖ్యంగా విద్యార్థులకు స్కూలుపుస్తకాలనుకోండి.) ధ్యానంచేస్తున్నా, స్వభార్యదగ్గరపడుకున్నా (పాతచింతకాయ పచ్చడాయెమరి!) ఇట్టే నిద్రవచ్చేస్తుందట.

వెంకటేశ్వరరావు నిక్కరుతొడిగి, బయలుదేరాడు, దండాలు, బస్కీలుకొట్టేందుకు. రంగనాయకులు ఫుట్‌బాలుకు. శర్మ చడుగుడుకోసం. శ్రీరాముడు, విఠల్, భరతుడు, మొదలైనవాళ్లు డ్రామా రిహార్సులకు. అంతా ఎవరిదారివారు పోతున్నారు.

ఆనందరావు బయలుదేరాడు, వెంట వాసు. ఆనందుకి కుడిభుజం వాసు. వాసుదంతా వక్రనడక. ఆనందుకి తైరుకొట్టడమే, లేక అతనికెవరైనా విరోధులుంటె వాళ్ళమీద చాడీలుచెప్పడమో,—ఏదోవిధంగా ఆనందుదగ్గర డబ్బుచిలుక్కుంటూఉంటాడు. ఆనందుకేం? లక్షాధికారికి ఒక్కడే కొడుకు. ఇలాంటివాళ్ళు ఎంతమంది తిన్నా లెక్కలేదు. వాళ్ళుపెట్టేదికూడా అలాంటివాళ్ళకే. నిజంచెప్పాలంటె అలాంటివాళ్ళులేనిదే వాళ్లు లాభంలేదు. వాలకంచూస్తే సినిమాకని తెలుస్తుంది.

వీళ్ళందర్నిచూచాడు రంగా. ఒక్కనిట్టూర్పు విడిచాడు. వాళ్లు తలిదండ్రులకు బాగాడబ్బుంది. పంపుతున్నారు. మా అబ్బాయిలు చదువుకుంటున్నారుకదా అని అనుకుంటారువాళ్లు. వీళ్ళకు చదవాలి, ప్యాసవ్వాలి అన్న ఉద్దేశ్యమే లేదు. అయినా ఎందుకు? ఈ చదువులుచదివి గుమాస్తా చేయవలసినగతి పట్టలా? ఖర్చుపెట్టుకోవడానికి యిదొకదాని. ఒక పుష్కరం, కాకపోతే రెండు పుష్కరాలు పుచ్చుకున్నా, ప్యాసయ్యేందుకు, అడిగేవాడులేదు.

వాళ్ళకు తనకు ఎంతతేడాఉంది? తనను డబ్బుంటేనా? ఏ ఆలోచనాలేకుండా ఎంతబాగా చదివేవాడు. నోట్సుతీసాడు చదువుదామని. పుస్తకాలైనా కొనుక్కునేందుకు శక్తిలేదు. అందుకని ఆ పుస్తకాలు, ఈ పుస్తకాలు చదివి, అధ్యాపకులుచెప్పింది, అర్థంచేసుకుని, వ్రాశాడానోట్సులు. ఒకే ఒక పుస్తకం కొన్నాడు పదిహేను పెట్టి. అయినా టెస్టుపుస్తకాలు, యిరవై పేజీలున్నా రెండురూపాయిలకమ్ముతాను. ఇదే అదునులాభాలకు.

మొన్నెవరో నోట్సుఅడిగితే యిచ్చాడు. తను నోట్సు బాగారాస్తాడనిపేరు. ఎన్నాళ్ళకు తెచ్చివ్వలేదు. అడిగితే, భార్య పిల్లాడిముందు చిత్తుపుస్తకమనిపారేస్తే, పిల్లాడు చింపేశాడట. ఏమనుకుంటే ఏంలాభం? అంత నిర్లక్ష్యం, వివాహం

విద్యానాశనం, శోభనం సర్వనాశనం అన్నారు పెద్దలు. ఇప్పుడు పిల్లాడున్నాడు కాబట్టి, ఇంకో వాక్యం చేర్చాలి.

నిజంగా ఆ విషయం తెలిసింతర్వాత ఎంత బాధ పడ్డాడో భగవంతుడికే తెలియాలి. ఏడ్చాడుకూడాను. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. తనకా, పుస్తకాలు లేవు. తను కేవలం ముక్తికోసరము చదవటంలేదు. ప్రత్యేకం భుక్తికోసం ఇవ్వనంటానికి వీల్లేదు; ఇస్తే ఇదీవరస.

చాకలి వచ్చాడు. "బాబూ! ఎనిమిదిరూపాయిలు అయింది మీపద్దు. డబ్బివ్వకపోతే బట్టలు తేవద్దన్నారు మేస్త్రీ. ఈ బట్టలే ఇవ్వద్దన్నారు. మీరు మంచివారనీ లేకయివ్వలేదనీ సర్ది చెప్పాను. ఇహ యివ్వకపోతే నా మర్యాద పోతుంది. మిమ్మల్ని కూడా—"

"చూడు మడేలూ? రేపులేదుఎల్లుండిప్రొద్దున్నే తెచ్చియిస్తాను. అంతగా వద్దంటె అవ్వాళే నా బట్టలు తీసుకొని పోదువుగాని."

"ఇలాంటివాయిదాలు చాలా అయినవి, ఇహ వాయిదాలంటూ వప్పుకునే మనిషికాదతను."

"నీకు నామీద నమ్మకముంటె వెళ్లు. లేదా, ఈ బట్టలు తీసుకుపో, ఈ ఒక్క చొక్కా లాగూవల్ల నీ బాకీ తీరుతుందా?"

"తీరదనుకోండి. కాని నేనేం చేసేది? సరే వస్తానండి" వెళ్ళాడు.

బాధపడ్డాడు. ఎల్లుండి ఎట్లా వస్తాడు? కాణీ వచ్చే ఉపాయం కనుపించటంలేదు. కాని, ఖర్చులు చూస్తే విపరీతంగా ఉన్నాయి. పైగా తనకున్నవి రెండేరెండు చొక్కా-లాగులు. ఆ జత వస్తేనే గాని, ఈ జత విప్పేందుకు వీల్లేదు. అందుకని తొందరగా కావాలి. కావాలంటె అర్జంటు బట్టకు మూడణాలు. గత్యంతరలేదు.

వార్డెను వచ్చాడు. "మిస్టర్ రంగా!... ఇంకా "మెస్‌ఫీజు" చెల్లించలేదే? నెల దాటిపోయింది. పైగా పదిరోజులు గడిచాయి."

"అవునండి. కాని నేను హాస్టలు వదలిపోదామనుకుంటున్నాను. నేను డిపాజిట్ కట్టిన దాంట్లో దీన్ని తగ్గించుకొని మిగతా యిస్తే—"

"వీల్లేదు."

"ఎందుచేతండి?"

"నువ్వు సంవత్సరపు అద్దెంతా కట్టిపోవాలి."

"కాని నేను నాలుగు నెలలముందే వెళ్ళిపోతున్నాను."

"వెళ్లినాకూడా కట్టాలి. నీ భోజనానికయింది, ఈ అద్దె మినహాయిస్తే, ఇంకా నువ్వే పదిరూపాయిలదాకా కట్టాల్సి వస్తుంది."

"ఇవి మొదట మీరు చెప్పలేదు."

"మీరే తెలుసుకోవాలోయ్."

"ఇదేమి న్యాయమండి?"

"షటప్. పెద్ద చిన్నా లేకుండా మాట్లాడుతావు. గెటవుట్" కోపంగా నిష్క్రమించారా వార్డెన్. రంగాకు బుర్ర తిరిగిపోయింది. కాసేపు ఏడిస్తే మనోబాధ తీరుతుందేమో!...కాని ఏడ్చే ఓపికకూడాలేదు. ఏడ్చినా రెండుచుక్కల నీళుకూడా రాలేటట్టు కనుపించలేదు. శోభనరావు వచ్చాడు. శోభన్ రంగా నెక్కువ ప్రేమిస్తాడు. రంగా కష్టబడుతూఉంటె తనూ కష్టబడతాడు.

"రంగా!..."

"ఏం?"

"ఇవ్వాళన్నా కాలేజీ ఫీజు కట్టావా?"

"లేదు."

"ఏం?"

"ఇదివరకు కట్టిందే దండగనుకున్నాను."

"అదేమిటి రంగా?"

"అంతే లే."

"ఇప్పటికి యిరవైరోజులనుంచి అటెండెన్సు పోవడంలేదూ? పైగా అటెండెన్సు తక్కువైతే పబ్లిక్ పరీక్షకు కూర్చోనిస్తారా? డిటెయిన్ చెయ్యరూ?"

"చాలా మంచిది."

"అదేమిటి రంగా—అలా అంటున్నావ్?"

"శోభన్! నాకు నేనై మానేయలేను. వాళ్ళే మానిపిస్తే సంతోషపడతాను."

"బాగా ఉంది. రేపులేదు ఎల్లుండి యూనివర్సిటీకి పబ్లిక్ పరీక్ష ఫీజు కట్టాలి. అదే ఆఖరు తారీఖు. రెండూ కలిపి కట్టటం కట్టటం కష్టం కాదూ?"

"కట్టదలిస్తేగా."

"అంటే? నీశ్రమంతా వృధాకాదూ?"

"వృధా!..." గట్టిగా గాలిపీల్చాడు రంగా.

"రంగా! నీ మనసులో ఏముందో నాకు కూడా చెప్పటంలేదు. ఎందుకలా బాధపడు

తున్నావో అర్థం కావడంలేదు. అసలు విషయం నాకు చెప్పు."

"చెప్పి నిన్నకూడా బాధపెట్టటం నాకిష్టం లేదు."

"రంగా! ఈ నాలుగు నెలలు కష్టపడితే బి. ఏ. పట్టా పుచ్చుకుంటావు. 'కష్టేఫలి' అన్నారు పెద్దలు."

"అబద్ధం! శుద్ధ అబద్ధం" ఉద్రేకంతో అనేశాడు. లేచి బయలుదేరాడు. ఎక్కడికో? తనకే తెలియదు. పోబోయాడు.

"రంగా! ఆ పాడు శోభనరావు. అసలు విషయం నాకు చెప్పవా? నా చేతనైన సహాయం చేస్తా. నామాట వినవూ. చెప్పకపోతే నామీద ఒట్టే."

"శోభన్! ఏంచెప్పేది? నాతండ్రి ఒక చిన్న భూస్వామి. ఉన్నవి రెండెకరాలు. నన్ను చదివించాలని ఆయన పట్టుదల. నేను పెద్దచదువు చదివి, పెద్ద ఉద్యోగంచేస్తే చూద్దామని ఆయన ఉబలాటపడతాడు. నాకోసం తను ఎంతైనాకష్టపడతానంటాడు. ఇంట్లో చూడబోతే పెండ్లీడుకు వచ్చిన చెల్లెలుంది. తమ్ముళ్లు స్కూల్లో చదువుతున్నారు. నేను చదివి ఉద్యోగం చూస్తాంటే దానితో చెల్లెలు పెండ్లి, తమ్ముళ్లను నాదగ్గర ఉంచి చదివిద్దామనుకుంటాడు. కాని, ఈయేడు అమ్మకు అకస్మాత్తుగా జబ్బుచేసింది. ఇన్ని ఖర్చులు భరించాలి. పైగా నన్ను చదివించాలి. నాకు తెలుసు బి. ఏ; చదివి నా గుమాస్తాతప్ప మరోహాటిరాదని. కాని, ఆయనకు నచ్చచెప్పటం కష్టం. ఆయనపడే ఆనందాన్ని చూచి నాకు చదువు మానాలని లేదు. కాని శక్తిలేదు. ఇంకా ఏంచెప్పేది? అనవసరంగాఒట్టు పెట్టి నా చేతచెప్పించి నువ్వు బాధపడుతున్నావు. నాకుతెలుసు నీ స్థితికూడాను. చెల్లని అణాకాసులన్నీ ఒక పక్కకు చేరుతాయి. అదే మన ఇద్దరి పరిస్థితి..."నిట్టూర్చాడు.

శోభన్‌రావు బాధపడ్డాడు. బాధమాత్రంపడగలడు. కాని, సహాయంచేసే శక్తిలేదు. అతడు ఇలాంటికష్టాలుచాలా అనుభవించాడు.

"పోనీ, ప్రిన్సిపాలుగార్నడిగి సగంజీతంమాపు చేయించుకునే ఉపాయంచూడకపోయావా?"

"అయినా ఎందుకు? దాంతో చదవకలుగుతావా?"

"అదేమిటి? చన్నీళ్ళకు వేన్నీళ్ళు."

"నీకు తెలీదుశోభన్, మనకు మాపుచెయ్యరు. నేను బీదవాడిని అంటే నమ్మవద్దా? అదీగాక, దానివల్ల ప్రయోజనంకూడాలేదు. పోనిద్దూ..." లేచి చరచరానడచాడు.

హోటలుదాకా వచ్చాడు. కాఫీ తాగాలని ఉంది. అప్పును ప్రొద్దున్నెప్పుడోగుక్కెడుతాగేడు కాని, డబ్బులేదు. శోభన్‌ను అడుగుదామా అనుకున్నాడు. కాని, శోభన్‌మాత్రం ఏమంత ధనికుడు? రోజూ అడిగితే ఉన్న విలువకూడా పోతుంది.

జేబులుతడిమాడు, అణా ఉంది. సిగరెట్లు కొన్నాడు. కాల్చిబయలుదేరాడు. గ్రౌండులో విద్యార్థులంతా ఆడుతున్నారు. మధ్యమధ్య ఉత్సాహంతో కేకలువేస్తున్నారు. వాళ్ళ ఆనందం వాళ్ళది.

గ్రౌండుదాటి రోడ్డుమీదపడ్డాడు. కొంత దూరం నడచాడు. కాలవగట్టుకుమళ్లాడు. ఒడ్డుమీదకూర్చొని మళ్లీ ఒకసిగరెటు ముట్టించాడు. మళ్ళీ ఏదో ఆలోచనలోపడ్డాడు. సిగరెట్టు కాలిపోతోంది. కాల్చాలన్నధ్యాసే లేదతనికి. నిట్టూర్పులువిడుస్తాడు, ఉఛ్వాస, నిశ్వాసలుసుట్టిగా విడుస్తాడు. మనస్సులో ఏమేభావాలు జనిస్తున్నాయో, అతనికి ఆ భగవంతుడికే తెలియాలి.

"రంగా!..." ఏదో చెవుల్లో దూసుకొని పోయినట్టుగా అనుపించింది. ఎవరో ఎవర్నో పిలుస్తున్నారు. తననుమాత్రం కాదు. ఈ మాటు గట్టిగా వినిపించింది. కాని తేరుకోలేకపోయాడు. మళ్ళీ పిలుపు...

"ఆఁ..." అంటూ వెనక్కితిరిగాడు-సుశీల.

"సిగరెట్లు కాలుస్తున్నావా?" అడిగింది సుశీల.

రంగా సమాధానంచెప్పలేదు. మౌనంగా తలవంచాడు.

"ఈ దురలవాటేమిటి?"

"కాదు సుశీలా. బాధపడే హృదయాలకు ప్రశాంతతను చేకూర్చే పరమౌషధం...ఇలా వచ్చేవేం?"

"కాలవ దాటిపోవాలి. ఇంకా బల్లకట్టు అవతలే ఉంది. సరేగాని, నీ జాగ్రఫీ నోట్సు కొంచెమిస్తావా?"

రంగా తలమాత్రం ఊపాడు-ఇస్తానన్నట్టు. సుశీల యిలా రంగాతో కల్పించుకొని మాట్లాడటం యిది ప్రథమ పర్యాయంకాదు. ఏమీలేక పోయినా, లేనిపోనివి కల్పించి రంగాతో మాట్లాడుతూ ఉంటుంది. రంగా కాదనలేదు. అతనికి తెలుసు. ఆవిడ హృదయంలో మార్పుకలిగిందని. కాని, తగినసమయం రాలేదు. వస్తే దాన్ని మార్చాలని అతని ఉద్దేశ్యం.

"డ్రామాలలో బ్రహ్మాండంగా నటిస్తావుకదా మరి యిప్పుడువేసే డ్రామాలలో పాల్గొనటం లేదేం?"

"ఇష్టంలేక" అంతే అతని సమాధానం.

"పత్రికలలో నీ వ్యాసాలు చూచాను. చాలా చిన్నవిషయాన్ని, అతి వాస్తవిక విషయాన్ని తీసుకొని చక్కగారాస్తావు. మరిప్పుడు బొత్తిగా వ్రాయటం మానివేశావేం?"

"లాభంలేక."

"అంటే? ప్రతిదానికి లాభం ఉండాలా?"

రంగా సమాధానం చెప్పలేదు.

"పేరు రావటంవేరు. అప్పుడు నువ్వు కాలేజీలో వేషాలు వేసేటప్పుడు ఎంతమంది 'నిన్ను మెచ్చుకునేవారో తెలుసా. అదంతా యెందుకు, నీ వ్యాసాలు ఎంతమంది హృదయాలను కదిలించాయో తెలుసా? ఇంకా ఏంకావాలి? పేరు కంటె మంచిదేముంది—ఈరోజుల్లో."

"కాని, నాకు పేరుతెచ్చుకోవాలని యిష్టం లేదు."

"నీదంతా వింత తత్వం."

"కావచ్చు."

"బాగా చదువుతున్నావా?"

"కొంత మానివేశాను."

"అదేమిటి? పరీక్షలు దగ్గరకువచ్చాయి తెలుసా?"

"నేను పరీక్షలకు కూర్చోదలచలేదు."

"అంటే?" సుశీల హృదయంలో ఓ పెద్ద బండ పడ్డట్టయింది.

"చదువు మానేస్తున్నాను."

"ఆఁ" అదిరిపోయింది.

"అవును. రేపు వెళ్ళిపోతున్నాను" రంగా వెళ్ళిపోతానంటున్నాడు. వెళతాడు. వెళితే తనగతి? తను ఎవర్ని ఇన్నాళ్ళూ ఆరాధిస్తోందో అతనే వెళ్ళిపోతున్నాడు. ఏనాటికైనా తనది అనుకున్నది, తనది కాకుండాపోతోంది. ఇహ మళ్ళీ అతన్ని చూచే భాగ్యం తనకుండదు. ఎందుకో అనాడు నాలుగు సంవత్సరాల పూర్వం అతన్ని చూచింది ఉపన్యాసమిస్తూ ఉండగా. నాలుగు సంవత్సరాలనుండి అతన్ని చూస్తూనే ఉంది. ఆ రోజు అతను వెళ్ళిపోతాడు. తలంతా తిరిగిపోతోంది.

"అయితే నేనూ మానేస్తా" ఉద్రేకంతో అనేసింది.

"అదేమిటి నాగురించి నువ్వు మానివెయ్యటం దేనికి?"

"నువ్వు లేనిదే నేను చదవలేను."

"కారణం?" అడిగాడు ఆశ్చర్యంగా.

"నీకు తెలీదా? నీకోసం చదువుతున్నా. నువ్వు లేకపోతే..."

"అర్థమైంది సుశీలా. నీకో విషయం చెబుదామని ఎన్నాళ్ళనుండో అనుకుంటున్నాను."

"ఏమిటి?"

"నీకూ—నాకూ చాలా తేడా ఉంది. మన అంతస్తులు వేరు. నువ్వు భాగ్యవంతుల కూతురివి. నేను నిర్భాగ్యుని పుత్రుణ్ణి. మనిద్దరం కలవాలంటే, నువ్వు నా స్థితిలోకి రావాలి. లేదా నేను నీ స్థితిలోకన్నా రావాలి. కాని, ఈ రెండూ దుర్లభం."

"అదిగాదు. రెండూలభిస్తాయి. నా ఒంటిమీద నగలతో వచ్చేస్తాను. వాటినమ్మి ఏ వర్తకమో, వ్యాపారమో..."

"అర్థమయింది. నా కిష్టంలేదు."

"నా హృదయాన్ని అర్థం చేసుకోలేకపోతున్నావు."

"నీవ్వూ అంతే."

"నాస్థితిలో నువ్వు ఉంటే అలా అనగలవా? కవివి, నటుడివి, అన్నీ తెలిసినవాడివి, నన్నిట్లా మోసంచేస్తావా?"

"నిన్ను మోసం చెయ్యాలని నాకుంటే ఎప్పుడో చేసేవాణ్ణి. నువ్వు తేలిగ్గా లొంగిపోతావు. కాసేపు ఆ యిల్లూ, ఈ పొలాలు,

ఈ మైదానాలు నావేనంటే, ఈ ఊళ్లో కాక పోతే మరొక ఊళ్లో చూపించాననుకో, నువ్వు యిట్టే నమ్మివేస్తావు. (ఇలాంటి సంఘటన జరిగి నట్లు విన్నాను. ఆ అమ్మాయిని మోసంచేసి తీసు కొనిపోయి, ఏడూళ్లోనో కాపురంపెట్టి, నగలన్ని అయిపోయింతర్వాత వదలి వచ్చేశాడట) కాని నా కలాంటి దుర్బుద్ధి లేదు."

"అయితే నువ్వు నన్ను ప్రేమించటం లేదా?"

"అవును నే నెవర్ని ప్రేమించను. నన్నెవరు ప్రేమించవద్దు. నేను హృదయంలేని జంతువుని, నాకు ప్రేమించటం చేతకాదు. ప్రేమించను. ప్రేమించలేను కూడాను..." చర్రున లేచి వెళ్లి పోయాడు. సుశీల ఎన్ని పిలిచినా లాభం లేక పోయింది. నిర్విణ్ణురాలై నిలబడిపోయింది.

కాలేజీకి చేరాడు రంగా. శ్రీహరి ఎదురు పడ్డాడు. మంచి సూటులో ఉన్నాడు. రంగా చొక్కా కొంచెం బుజంమీద చిరిగితే కుట్టిం చాడు, పైగా బాగా మాసింది. ఎప్పుడు కలిసినా శ్రీహరి ఏం రంగా అంటూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవాడు. ఇవ్వాళ ఎందుచేతనో పెడ ముఖం పెట్టాడు. రంగా గ్రహించాడు. తన బట్టలన్ని మాసిఉన్నాయి. దానికి తనేం చేయ లేడు. సిగ్గు పడ్డాడు. గబగబ రూమునుంచి బయలు దేరాడు.

దార్లో అనుకున్నాడు. శ్రీహరి తనదగ్గరకు అనేకసార్లు అనేక విషయాలు అడిగి తెలుసు కునేందుకు వచ్చేవాడు. అతనికి డబ్బుండవచ్చు, బట్టలు బాగా వేయవచ్చు, కాని బుర్ర శూన్యం. అలాంటివాడుకూడా తన్ను అవమానించాడు. తనస్థితిచూస్తే అతనేమిటి ఎవరైనా అంతే. తన లోపల ఎంత సరుకుంటె ఎవరిక్కావాలి. ఐనా, తనకుమాత్రం బుద్ధి ఉండక్కర్లా. అతను పలక రించలేదని అనుకోవడం దేనికి?

గబగబా నడుస్తూంటె కాలికి రాయి కొట్టు కొని చిటికెనవేలుగోరు తెగిపోయింది. రక్తం కారడం మొదలుపెట్టింది. అమితమైన బాధ పెడుతోంది. బాధ భరించలేకపోయాడు. కండ్లవెంట నీళ్లు తిరిగాయి.

గూటికి చేరాడు.

"రంగా!" శోభనరావు. "అదేమిటి?" అని ఆశ్చర్యపోయాడు రక్తం చూచి. "అరె! గోరుకి గోరే లేచిపోయిందే?" అంటూ జేబురుమాలు నీళ్లల్లో తడిపి రక్తం అంతా తుడిచాడు. ఐడిన్ కొంచెంరాసి గుడ్డకట్టాడు.

"ప్రొద్దున్నే ఎవరిముఖం చూచావో?"

"దెబ్బ తగులబట్టి అంటున్నావ్?"

"శోభన్! ఇదిగో? యీ పుస్తకం పదిహేను రూపాయలకు కొన్నా. ఏ కుర్రాడికైనా కావ లసిందేగా?"

"ఎందుకిప్పుడిదంతా?"

"విను. ఎవరికైనా అమ్మేయ్. పదిరూపా యిలు రావూ? చాకలికి యిచ్చివేయ్. ఆలస్యం చేసినందుకు రెండు రూపాయిలు ఎక్కువ ఇస్తు న్నానని చెప్పు."

"అదేమిటి మరి నీవు?"

"చెప్పింది విను! సుశీలవస్తే ఏనోట్సు కావా లంటే ఆ నోట్సు యిచ్చేయి. మిగతావి నువ్వు ఉంచుకో."

"నాకేం అర్థం కావడంలేదు."

"నేను బండికి వెళ్ళిపోతున్నా."

"ఎక్కడికి?"

"యింటికి" అంతే. ఆ రెండుజతలూ జంబు కానాలోచుట్టాడు.

"చూడు శోభన్. ఒక రూపాయి ఉంటే యిస్తావ్?"

"ఆఁ..." శోభనరావుకు కండ్లలో నీళ్లు తిరి గాయి.అగమనలేదు, పొమ్మనలేదు. బాధపడుతూ రూపాయి యిచ్చాడు. అంతే. రంగా వెళ్ళి పోయాడు. అతనికేసే చూస్తూ శోభన్ దర వాజా దగ్గిర ఆగిపోయాడు.

---

డిసెంబరు 10వ తేదీన మానవుల హక్కుల దినోత్సవాలు అనేక స్వతంత్ర దేశాలలో జరపడానికి ఏర్పాట్లు పూర్తి అయాయి. సమితి ప్రధాన కార్యదర్శి ట్రిగ్వేలీ ఆ ఉత్సవాలను జరుపవలసినదిగా కోరుతూ అన్ని దేశాలకు లేఖలు పంపారు. 1948 లో ఐక్యరాజ్యసమితి మానవుల హక్కుల ప్రణాళికను రూపొం దించింది. ఆల్ ఇండియా రేడియో న్యూఢిల్లీ కేంద్రంనుంచి ఆ రోజున ప్రత్యేక కార్యక్రమం ప్రసారం చేయడానికి ఏర్పాటు చేయబడింది.